అభివృద్ధి పనులను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి-అనంతగిరి (విశాఖ)

విశాఖ మన్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం శుక్రవారం అనంతగిరి మండలంలో పర్యటించింది. రిటైర్డ్ డిజి (ఎన్ఎస్ఎస్ఒ) ఎకె.మెహ్రా, సంజయ్ హుస్సేన్, అశోక్ పంకజ్, సతీష్‌కుమార్, రవిశ్రీ వాస్తవ్, ఇంద్రహరి, జగదీష్ పలన్, మహేశ్వర్ సింగ్‌లతో కూడిన బృందం ఎన్ఆర్.పురం పంచాయతీ కాశీపట్నం నుంచి ఎన్ఆర్.పురం వరకు రూ.3.50 కోట్లతో నిర్మిస్తున్న తారురోడ్డు పనులను పరిశీలించింది. రోడ్డు పనుల జాప్యంపై బృందం సభ్యులు అధికారులను ప్రశ్నించారు. అరకు మండలం సుంకరమెట్ట గ్రామంలో కాఫీ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. తైడా జంగిల్‌బెల్‌కు చేరుకొని మధ్యాహ్న భోజనం అనంతరం విశాఖకు పయనమయ్యారు.

తిరుమలలో శుక్రవారం శ్రీవారి దర్శనానికి విచ్చేసిన నీతి ఆయోగ్ వైస్‌ఛైర్మన్ రాజీవ్‌కుమార్ కుటుంబ సభ్యులు

ఎపెక్స్ రొయ్యల కంపెనీపై ఐటి దాడులు

ప్రజాశక్తి-తాళ్లరేవు (తూర్పుగోదావరి)

తూర్పుగోదావరి జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి చెంతన ఉన్న ఎపెక్స్ రొయ్యల కంపెనీపైనా, వివిధ ప్రాంతాల్లోనున్న ఆ సంస్థ కార్యాలయాలపైనా ఇన్‌కంట్యాక్స్ అధికారులు గురువారం రాత్రి ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. సామర్లకోట మండలం పనసపాడు గ్రామ పరిధిలో ఉన్న ఎపెక్స్ రొయ్యల కంపెనీలోనూ, తాళ్లరేవు మండలం పెద్దాపురం, మూలపేటల్లోనూ ఏక కాలంలో ఐటి అధికారులు దాడులు చేశారు. కోరంగి ఎపెక్స్ రొయ్యల కంపెనీలో గురువారం ఉదయం 9 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున మూడున్నర గంటల వరకూ ఐటి అధికారులు పలు రికార్డులు పరిశీలించారు. సుమారు 18 గంటల పాటు సిబ్బందిని ఐటి అధికారులు విచారించారు.

కనీస వేతనాలు అమలు చేయని రొయ్యల కంపెనీలు

రొయ్యల కంపెనీల్లో వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారికి కనీస వేతనం ఇవ్వడంలేదని ఎపెక్స్, నెక్కంటి, దేవి సీఫుడ్స్ కంపెనీల కార్మిక నాయకులు విమర్శిస్తున్నారు. కార్మిక చట్టం ప్రకారం ప్రతి కార్మికునికీ కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాల్సి ఉండగా రోజు కూలీ రూ.200 నుంచి రూ.250 మాత్రమే ఇస్తున్నట్టు చెబుతున్నారు. తక్కువ మొత్తంలో కార్మికులకు వేతనాలు చెల్లించి, జీతాలు ఎక్కువ ఇస్తున్నట్టు ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్‌లో చూపిస్తున్నట్టు సమాచారం.

ఏమిటీ బంధం...!

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

హనుమాన్ డెల్టా షుగర్స్ లాకౌట్ వెనుక మరో కోణముందా..! సహకార రంగంలో ఉన్న చక్కెర ఫ్యాక్టరీని ఉద్దేశ్య పూర్వకంగా ప్రైవేటు పరం చేశారా..! దెబ్బతింటున్న రైతులు, కార్మికుల ప్రయోజనాలను సైతం పక్కన పెట్టి కావాలనే లాకౌట్ ప్రకటించారా..!! ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఫ్యాక్టరీ అధినేత గోకరాజు గంగరాజుకు మధ్య ఉన్న బంధమేమిటి.? కృష్ణాజిల్లాలో హల్‌ఛల్ చేస్తున్న ప్రశ్నలివి...

2001లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉండగా సహకార రంగంలో పనిచేస్తున్న చక్కెర ఫ్యాక్టరీని గోకరాజు గంగరాజుకు కేవలం రూ 11.80 కోట్లకు (వందెకరాల భూమి మరియు మిషనరీ) కారుచౌకగా కట్టబెట్టారు. ప్రైవేటు యాజమాన్యంలో ఫ్యాక్టరీ అభివృద్ధి చెందుతోందని, రైతులకు గిట్టుబాటు ధర దక్కుతుందన్న చంద్రబాబు మాటలను గుడ్డిగా నమ్మారు. ఫ్యాక్టరీ మూలధనంలో 7.5శాతం ఉన్న షేర్‌ధనాన్ని త్యాగం చేశారు. ఫ్యాక్టరీని అధీనంలోకి తీసుకున్న గోకరాజు పదిహేను సంవత్సరాలు గడవక మునుపే నష్టాలు వస్తున్నాయంటూ ఏకపక్షంగా లాకౌట్ ప్రకటించారు. దీనిని అడ్డుకోవాల్సిన చంద్రబాబు సర్కార్ ఎవరైనా నష్టాలను ఎంతకాలం భరిస్తారంటూ వెనకేసుకు రావటంతో బాధితులు అవాక్కయ్యారు. యాజమాన్యం దగ్గర తీసుకున్న సుమారు రూ 2 కోట్ల పంట రుణాలను వెంటనే చెల్లించాలని షుగర్‌కేన్ కమీషనర్ రైతులపై వత్తిడి చేస్తున్న తీరుతో మోసపోయినట్లు గ్రహించారు. రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించమంటూ ఒకపక్క పారిశ్రామిక వేత్తలకు పిలుపునిస్తూనే మరోపక్క నష్టాలు వస్తున్నాయని చెబుతూ ఫ్యాక్టరీలను మూపివేస్తున్న యాజమాన్యాలను చంద్రబాబు వెనకేసుకొస్తున్న తీరు బాధితులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఫ్యాక్టరీ విషయంలో గోకరాజు గంగరాజుకు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు మధ్య ఉన్న బంధం ఏమిటన్నది అర్థంకాక తర్జన భర్జన పడుతున్నారు.

కృష్ణాజిల్లా నూజివీడు, గన్నవరం నియోజకవర్గాలకు చెందిన చెరకు రైతులు 1983లో కోఆపరేటివ్ సెక్టార్ కింద హనుమాన్‌జంక్షన్ సమీపంలో హనుమాన్ షుగర్ కో ఆపరేటివ్ లిమిటెడ్‌ను ప్రారంభించారు. దీని పరిధిలో 2,000 మంది రైతులు ఐదు వేల ఎకరాల్లో చెరకు పండించేవాళ్లు. 1999లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కన్ను దీనిపై పడింది. సహకార రంగం కన్నా ప్రైవేటు రంగంలో రైతులకు ప్రయోజనాలు అధికమని, చెరకు పంటకు అధిక ధర లభిస్తుందని రైతులను నమ్మించారు. వంద ఎకరాల భూమితో పాటు ఫ్యాక్టరీని రూ 11.80 కోట్లకు గోకరాజు గంగరాజుకు కట్టబెట్టారు. వందల కోట్ల విలువైన ఆస్థులను కారుచౌకగా కట్టబెట్టడం వెనుక రహస్య ఒప్పందాలు దాగి ఉండవచ్చునని సిపిఎం అప్పట్లో హెచ్చరించినా ఖాతరు చేయలేదు. నష్టాలు వస్తున్నాయని రెండు నెలల క్రితం ఫ్యాక్టరీ యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. దీనిని సిపిఎం, సిపిఐ, వైఎస్ఆర్ సిపితో పాటు ఇతర వామపక్షాలు ఖండించాయి. అటు పక్కనున్న ఆంధ్రా షుగర్స్‌కు, ఇటు పక్కనున్న కెసిపి షుగర్స్‌కు లాభాలు వస్తుంటే మధ్యలో ఉన్న డెల్టా షుగర్స్‌కు నష్టాలు ఎలా వస్తున్నాయని మండిపడ్డాయి. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనంతగా చక్కెర ధరలు కొండెక్కి కూర్చున్నాయని ఎత్తిచూపారు. అయినా యాజమాన్యం తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లన్నట్లు లాకౌటేకే మొగ్గు చూపింది.

పదేళ్ల తర్వాత తిరిగి రాష్ట్ర పగ్గాలు చేపట్టిన చంద్రబాబు డెల్టా షుగర్స్‌పై మరోమారు అవాజ్యమైన ప్రేమను కనబర్చారు. నష్టాలు వస్తున్నాయని ఫ్యాక్టరీ మూసివేస్తే తప్పేమిటంటూ వెనకేసుకొచ్చారు. ప్రైవేటు సెక్టార్‌లో ప్రయోజనాలు అధికమని చెప్పి ఫ్యాక్టరీని విక్రయించే వరకూ నిద్రపోనివ్వని చంద్రబాబు ఇప్పుడు లాకౌట్ ప్రకటిస్తుంటే అడ్డుకోవాల్సిందిపోయి యాజమాన్యానికి కొమ్ముకాయటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఫ్యాక్టరీ బదలాయింపు, లాకౌట్ వ్యూహం ప్రకారమే జరిగి ఉంటాయన్న అనుమానాలతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు...

ఆక్వాకు మళ్లుతున్న సాగు నీరు

తూర్పుగోదావరి జిల్లా ఐ.పోలవరం శివారు ప్రాంతాల్లో మోటారు ద్వారా నీటిని తోడుకుంటున్న రైతులు

శివారు భూములకు అందక రైతుల ఆందోళన

రబీకి పొంచి ఉన్న గండం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

తూర్పుగోదావరి జిల్లాలో వరి సాగుకు నీటి కొరత ఏర్పడింది. శివారు ప్రాంతాలకు నీరు అందడం లేదు. నాట్ల దశలోనే ఇబ్బందులు ఏర్పడ్డాయి. రబీని గట్టెక్కించేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లవైపు చూస్తున్నారు. రెండో పంటకు సాగునీటి ఇబ్బందులు ఏటా ఎదురవుతున్నాయి. ఆక్వాకు, చేపల చెరువులకు ఈ సీజన్‌లో సాగునీటిని వాడేందుకు అనుమతి లేకపోయినా విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. రబీ సాగుకు నీటి గండం పొంచి ఉండటంతో నాట్లు దశ పూర్తి కాకుండా నీటి ఇబ్బందులు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

తూర్పుగోదావరి జిల్లాలో రబీ సీజన్‌లో 3.70 లక్షల ఎకరాల్లో సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటివరకూ 80 శాతం మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. ఇంకా 20 శాతం నాట్లు వేసే దశలో ఉన్నాయి. మరో వారం రోజుల్లో నాట్లు పూర్తయ్యే అవకాశాలున్నాయి. నాట్లు పూర్తికాకుండానే నీటి కష్టాలు రావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శివారు ప్రాంతాలకు సాగు నీరందకపోవడంతో రైతులు కాలువల్లో ఉన్న నీటిని మోటార్లతో తోడాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో 7,382 క్యూసెక్కులు మాత్రమే ఉండగా, డెల్టాకు 7,760 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో ఇన్‌ఫ్లో 378 క్యూసెక్కులు తక్కువగా ఉందని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. జిల్లాకు ఇంకా ఏడు క్యూసెక్కుల నీరు అవసరం. సీలేరు నుండి అదనపు జలాల కోసం అధికారులు ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు.

అక్రమ నీటి వాడకాన్ని అడ్డుకోవాలి
తిరుమలశెట్టి నాగేశ్వరరావు, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు

జిల్లాలో రెండో పంటకు నీరు పూర్తిగా అందకుండా చేపల, రొయ్యల చెరువులకు నీటిని తోడేస్తున్నారు. ఇరిగేషన్ అధికారులు అక్రమ వాడకాన్ని నిరోధిస్తేనే పూర్తిస్థాయిలో రబీకి నీరు సరిపోతుంది. ఇన్‌ఫ్లో తగ్గిపోవడం, ఆక్వాకు నీటిని వాడేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మెరక భూములకు అనుమతి ఇవ్వకూడదు. కెనాల్స్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. దాన్ని పునరుద్ధరిస్తే కొన్ని క్యూసెక్కుల నీటినైనా ఆదా చేసేందుకు అవకాశం ఉంటుంది.

కోనసీమలోనూ కష్టాలు

కోనసీమలోని ఐ.పోలవరం, కాట్రేనికోన, అయినవిల్లి, మామిడికుదురు, తాళ్లరేవు, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల శివారు ప్రాంతాలతోపాటు సెంట్రల్ డెల్టాలోని పెదపూడి, అనపర్తి, రాయవరం మండలాల్లోనూ సాగునీరందక ఇబ్బందిపడుతున్నారు. జిల్లాలో లక్షా 25 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వీటిలో సుమారు 80 వేల ఎకరాల వరకూ అనధికారికంగా సాగవుతోంది. ఈ లక్షా 25 వేల ఎకరాలకు రెండో పంట సీజన్‌లో సాగు నీటికి అనుమతి లేకపోయినా, అక్రమంగా నీటిని తోడేస్తున్నారు. ఆక్వా చెరువుల కంటే చేపల చెరువులకే నీటిని ఎక్కువగా తోడేస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒక వైపు పై నుండి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గిపోతుంటే నీటిని అక్రమంగా చెరువులకు మళ్లించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి జిల్లాలో సెంట్రల్ డెల్టా, తూర్పు డెల్టా ప్రాంతాల్లోనూ 75 వేల ఎకరాల మెరక భూములకు రబీకి అనుమతించకూడదు. ప్రజాప్రతినిధులు ఎవరినీ కాదనలేక అనుమతి ఇచ్చేస్తున్నారు. చెరువులకు తోడేస్తున్నా పట్టించుకోకపోవడంతో ఆదిలోనే నీటి కష్టాలు వచ్చాయని రైతులు వాపోతున్నారు.

చేనేత కార్మికులను ప్రోత్సహించాలి

ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలను ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు తెలిపారు. ఒంగోలు కాపు కళ్యాణ మండపంలో స్వదేశీ హ్యాండీక్రాఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేనేత ప్రదర్శన, అమ్మకాలను ఎమ్మెల్యే దామచర్ల శుక్రవారం ప్రారంభించారు. చేనేత ప్రదర్శనలో ఉంచిన వస్త్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. చేనేత, హస్తకళల కార్మికులు తయారు చేసిన వస్తువులను ప్రజలు ఆదరించాలన్నారు. చేనేత కళాకారుల వస్త్రాలను ప్రజలలోకి తీసుకెళ్ళేందుకు స్వదేశీ హ్యాండీక్రాఫ్ట్ సొసైటీ కృషి అభినందనీయమన్నారు. చేనేత, హస్త కళల కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు టివి శ్రీరామమూర్తి, ఎమ్మెల్యే బావ, చిత్తూరు జిల్లా టిడిపి నాయకులు గుత్తా రవీంద్ర, నిర్వాహకులు కె.చిరంజీవి, వై.రాంబాబు, పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర హక్కు రైతుకే కల్పించాలి

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి - తాడికొండ (గుంటూరు జిల్లా)

పంటలకు గిట్టుబాటు ధరలను నిర్ణయించే హక్కు రైతుకు కల్పిస్తూ చట్టాలన్ని రూపొందించాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం లాంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మద్దతు ధర కొంత పెరుగుతున్నా రైతు ఆదాయానికి మాత్రం గండి పడుతోందని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం ఒక్క సీజన్‌లోనే భారత రైతులు రూ.2 లక్షల కోట్లు నష్టపోయారని అంచనాలున్నట్లు చెప్పారు. వ్యవసాయంపై శ్రద్ధ చూపని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు రూ.లక్షలాది కోట్లు మాఫీ చేస్తున్నాయని విమర్శించారు. 2014 నాటికి రూ.82 వేల కోట్లు మాఫీ చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కేవలం రూ.15 వేల కోట్లు లోపే రుణాలు మాఫీ చేసిందని వివరించారు. భూసేకరణ చట్టాన్ని పక్కనపెట్టి అభివృద్ధి పేరుతో సరైన పరిహారం లేకుండానే అవసరానికి మించి వేల ఎకరాలు రైతుల నుండి తీసుకుంటున్నారని, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలకు ఎకరా రూ.4 కోట్లు చొప్పున కేటాయిస్తూ ప్రయివేటు సంస్థలకు రూ.50 లక్షలకే ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఈ నెల 27వ తేదీన జొన్నలగడ్డలో రైతాంగ ప్రయోజనాల పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

'ఇండీట్రేడ్' శ్రీరామ్ ఆస్తులపై సిబిసిఐడి దర్యాప్తు

ప్రజాశక్తి- సంతకవిటి, రాజాం (శ్రీకాకుళం జిల్లా)

అధిక వడ్డీ ఆశ చూపి సుమారు రూ.200 కోట్ల డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసిన ఇండీట్రేడ్ షేర్ మార్కెట్ బ్రోకర్ టంకాల శ్రీరామ్ ఆస్తులపై సిబిసిఐడి బృందం శుక్రవారం దర్యాప్తు ప్రారంభించింది. గతేడాది డిసెంబరులో వెలుగు చూసిన ఈ ఆర్థిక నేరం కేసును ప్రభుత్వం సిబిసిఐడికి అప్పగించింది. ఈ నేపథ్యంలో సిబిసిఐడి డిఎస్‌పి, ఈ కేసు విచారణాది ,కారి ఎస్.భూషణ్‌నాయుడు ఆధ్వర్యాన ఎస్ఐ ఎల్.ఆర్.కె.నాయుడు, సిబ్బంది శ్రీకాకుళం జిల్లా సంతకవిటి మండలం మందరాడలోని శ్రీరామ్ నివాసాన్ని, తాలాడలోని కార్యాలయాన్ని పరిశీలించారు. బినామీల పేరిట ఉన్న ఆస్తులపైనా విచారణ చేపట్టారు. దీంతో తెరచాటున ఉన్న బినామీల్లో ఆందోళన ప్రారంభమైంది.

ఇండీట్రేడ్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సిబిసిఐడి బృందం

నిజాలు నిగ్గు తేల్చుతాం

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ ఆర్థిక నేరంలో నిజాలను నిగ్గు తేల్చుతామని సిబిసిఐడి డిఎస్‌పి భూషణ్‌నాయుడు అన్నారు. ఎవరినీ విడిచిపెట్టేది లేదని చెప్పారు. ఈ నేరానికి సంబంధించి మూడు కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులో బినామీలతో పాటు ఇంకెవరైనా ఉన్నారా? బినామీ ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి? ఎంతమేర ఉన్నాయి? వంటి అంశాలపై దర్యాప్తు వేగవంతం చేసి బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. ఇందుకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. వారి వెంట పాలకొండ డిఎస్‌పి స్వరూపారాణి, రాజాం రూరల్ సిఐ వీరకుమార్, సంతకవిటి ఎస్ఐ ఎస్.చిరంజీవి ఉన్నారు.

బిసి 'ఎఫ్' ద్వారా ఉద్యోగానికి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించండి

ముఖ్యమంత్రికి కాపు ఉద్యమనేత ముద్రగడ లేఖ

ప్రజాశక్తి - జగ్గంపేట (తూర్పుగోదావరి)

కాపు సామాజిక తరగతి యువతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో బిసి 'ఎఫ్' ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని కాపు ఉద్యమనేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కోరారు. ఈ మేరకు కిర్లంపూడిలోని తన నివాసం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బహిరంగలేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మూడేళ్లలో తమ సామాజిక తరగతి యువకులు వేల ఉద్యోగాలు, విద్యావకాశాలు కోల్పోయారన్నారు. బిల్లు ఆమోదించి రెండు నెలలు పూర్తికావస్తున్నా అమలుకు నోచుకోక అవకాశాలను కోల్పోతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న 14 యూనివర్సిటీల్లో సుమారు 700 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని తెలిపారు. త్వరలో డిఎస్‌సి, పోలీసు శాఖలో వేలాది ఉద్యోగాలను భర్తీ చేసే యోచనలో ప్రభుత్వవర్గాలు ఉన్నాయన్నారు. తమ సామాజిక తరగతి యువతకు బిసి 'ఎఫ్' ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందోలేదో తెలియజేయాలన్నారు. చంద్రన్న సంక్రాంతి కానుకల మాదిరిగా తమ సామాజిక తరగతి (కాపు, తెలగ, బలిజ, ఒంటరి)కి సంక్రాంతి నుంచే రిజర్వేషన్లు అమలుచేయాలని కోరారు.

45 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ఏడుగురు స్మగ్లర్లు అరెస్టు

మూడు మండలాల్లో ఏకకాలంలో దాడులు

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఎర్రచందనం స్మగ్లర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లాలోని వెంకటగిరి, దుత్తలూరు, మర్రిపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు చేసి అంతర్రాష్ట్ర, స్థానిక స్మగ్లర్లను అరెస్టు చేశారు. ఒఎస్‌డి విఠలేశ్వర్ శుక్రవారం ఆత్మకూరులో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. వెలిగొండలోని అటవీప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణ చేస్తున్నారనే సమాచారం అందింది. దీంతో ఆత్మకూరు డిఎస్‌పి రామాంజనేయరెడ్డి ఆధ్వర్యాన జిల్లా టాస్క్‌ఫోర్సు సిబ్బంది, వెంకటగిరి ఎస్ఐ కొండపనాయుడు, దుత్తలూరు ఎఎస్ఐ శ్రీనివాసరావు, మర్రిపాడు ఎస్ఐ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యాన మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మూడు ప్రాంతాల్లో స్మగ్లర్లు పోలీసులపై దాడులకు పాల్పడ్డారు. మూడు ప్రాంతాల్లో కలిపి 45 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఎనిమిది సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో తమిళనాడుకు చెందిన నలుగురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లున్నట్లు తెలిపారు. మరో ముగ్గురు డక్కిలి మండలానికి చెందిన వారున్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలపై గట్టి నిఘా ఏర్పాటు చేశామని ఒఎస్‌డి తెలిపారు.

ప్రత్యేకం

ప్రచారానికి ఉచిత 'మిత్రలు'..!

- దమ్మిడి ఆదాయం లేకుండా బండెడు చాకిరీ
- సరికొత్త శ్రమ దోపిడీ
- మహిళలే సమిధలు

ప్రజాశక్తి- చిత్తూరుప్రతినిధి

కనీస వేతనాలు ఇవ్వకుండా, కార్మిక చట్టాలు ఏవీ వర్తించకుండా స్కీమ్ వర్కర్లను దోచుకుంటున్న ప్రభుత్వం తాజాగా మరి కొంత మందిని ఈ విధానానికి బలి చేయబోతోంది. వందలుకాదు.. వేలు కాదు.. రాష్ట్ర వ్యాప్తంగా 2.50 లక్షల మందికి పైగా శ్రమను దోచుకోవాలని చూస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సాధికార మిత్రల పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. దమ్మిడి వేతనం ఇవ్వకుండా వారి శ్రమను దోచుకునేందుకు కుట్ర పన్నుతోంది.

తాము అధికారంలోకి వచ్చి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా అవి క్షేత్ర స్థాయిలో ప్రజలకు సక్రమంగా తెలియడం లేదని ప్రభుత్వం ఆలోచన. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు వచ్చిన ఆలోచనల్లో భాగమే ఈ సాధికార మిత్రలు. ప్రతి 35 కుటుంబాలకు ఒక్కరి చొప్పున పంచాయతీల్లోని క్లస్టర్ల వారీగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీరందరికి ఇప్పటికే శిక్షణా తరగతులు కూడా పూర్తి చేసింది. ఒక్క చిత్తూరు జిల్లాలోనే 27వేల మందిని ప్రభుత్వం నియమించింది. ఇక రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే 2.50 లక్షల మంది ఉంటారని అంచనా.

బండెడు చాకిరీ

సాధికార మిత్రల వద్ద ప్రభుత్వం బండెడు చాకిరీ చేయించుకో బోతోంది. ఇందులో భాగంగా ఒక్కొక్కరూ తమ పరిధిలోని కుటుంబాల స్థితి గతులను పూర్తిగా అర్థం చేసుకోవాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వాటికి విపులంగా వివరించి చెప్పాలి. అన్ని కుటుంబాలకు అన్ని పథకాల గురించి చెప్పడం సాధ్యం కాదు అందుకే కుటుంబ అవసరాలు ప్రణాళికా బద్ధంగా ఒక రోజు ఒక కుటుంబానికి కొన్ని పథకాల చొప్పున వివరించాలి. ప్రతి కుటుంబం ఇప్పటికే కొన్ని ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందుంతుంది. లబ్దిపొందిన పథకాల గురించి వారికి మరో సారి గుర్తు చేయాలి. తాము బాధ్యత తీసుకున్న కుటుంబాలలో వారికి ఎదురవుతున్న ముఖ్యమైన సమస్యలను గుర్తించాలి. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. నిరాశ నిస్పృహలతో ఉన్న కుటుంబాలకు ప్రేరణ కలిగించి వారిలో బాగుపడాలన్న ఆత్మవిశ్వాసం నింపాలి. ప్రతి కుటుంబానికి ఒక ప్రణాళిక రూపొందించాలి. ప్రభుత్వ పథకాలు పొందడానికి వారికి ఎదురవుతున్న ఆటంకాలను తొలగించడానికి సహకరించాలి. ప్రజల సమస్యలను 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా కాల్ సెంటర్‌కు తెలపాలి. ప్రభుత్వ ప్రత్యేక పథకాల గురించి వారికి తెలియజేయాలి. ఇలా సాధికార మిత్రలు బండెడు చాకిరీ చేయాల్సి ఉంది.

దమ్మిడి వేతనం లేదు

ఇలా పెద్ద ఎత్తున రాత్రింబవళ్లు తేడా లేకుండా పని చేయనున్న సాధికార మిత్రలకు ప్రభుత్వం దమ్మిడి వేతనం కూడా ఇచ్చేది లేదు. రోజువారి ఖర్చులకు, సమావేశాలకు కూడా వారే భరించుకోవాలి. తమ సొంత పనులను కూడా మానుకుని వారు ఎంచుకున్న 35కుటుంబాలకు సేవ చేయాలి. కార్యాలయాలకు కూడా తిరగాలి. రేషన్ కార్డులు, పింఛన్లు, భూ సమస్యలు ఇలా అన్నింటికీ వీరే ఆధారంగా ఉండి పని చేయాలి. ఈ ఖర్చులన్నీ కూడా తడిచి మోపెడు కానున్నాయి.

మహిళల శ్రమను దోచుకోవడమే

సంతృప్తి, సేవ అనే పేరుతో ప్రభుత్వం మహిళల శ్రమను దోచుకోవాలని చూస్తోంది. తన ప్రచార ఆర్భాటం కోసం ఇదంతా చేస్తోంది. ఇలా నియమించుకునే వారందరికీ కనీస వేతనం అమలు చేయాలి.

- కందారపు మురళి, సిఐటియు రాష్ట్ర నాయకులు

సంక్షిప్తం

తెలుగు గంగ కాల్వలో మహిళ మృతదేహం

సత్యవేడు: మండలంలోని బాలక్రిష్ణాపురం వద్ద తెలుగు గంగ కాల్వలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల మేరకు... సత్యవేడు కాలనీకి చెందిన దాసు భార్య సావిత్రమ్మగా గుర్తించామని సిఐ నరసింహులు తెలిపారు. మృతురాలికి 55 సంవత్సరాలు ఉంటాయని తెలిపారు. ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

రూ.లక్ష విలువైన గుట్కా పట్టివేత

శృంగవరపుకోట (విజయనగరం జిల్లా): విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద గురువారం రాత్రి పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఆటోలో తరలిస్తున్న 14 బస్తాల గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గుట్కాను తరలిస్తున్న సంతోష్‌కుమార్, వెంకటరమణను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి

దేవరపల్లి : పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద శుక్రవారం రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో, ఒక లారీలోని డ్రైవర్ మృతి చెందాడు. ప్రకాశం జిల్లా శింగరాయకొండ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ కిలారి వెంకటేశ్వరరావు (35) తూర్పుగోదావరి జిల్లా కాకినాడ నుంచి కడపకు లోడుతో బయలుదేరాడు. కృష్ణంపాలెం వద్ద ఆయన నడుపుతున్న లారీ, వేరొక లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి చనిపోయాడు.

రైలు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కర్నూలు : కర్నూలు నగరంలో ఆనంద్ టాకీస్ దగ్గర రైల్వే ట్రాక్‌పై ఓ యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. ఈ ప్రమాదంలో తన రెండు కాళ్లు, ఒక చేయి కోల్పోయా